ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 21 జూన్ 2024

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి 8లో..

వర్షాకాలంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి 8లో..



న్యూట్రీషన్ కిట్లు బంద్

జగిత్యాల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పుట్టబోయే శిశువు పూర్తి ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఉండొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూట్రీషన్ కిట్లకు ప్రస్తుతం గ్రహణం పట్టింది. నాలుగు నెలలుగా గర్భిణులకు ఇవ్వాల్సిన సుమారు రెండు వేల కిట్లు అందలేదు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు ఐదు తొమ్మిదో నెలల్లో మొత్తం రెండుసార్లు రూ. 2 వేల విలువ చేసే పోషకా హారాలతో కూడిన కిట్లను గత ప్రభుత్వం అందించింది. ఇవి గత ఫిబ్రవరి వరకు సజావుగా సాగగా ప్రస్తుతం వాటి ఊసే లేకుండా పోయింది. ఇక గర్భిణులు, పుట్టిన శిశువులకు గతంలో ఇచ్చిన కేసీఆర్ కిట్లను ఎంసీహెచ్‌కిట్లుగా పేరు మార్చిన ప్రభుత్వం వాటిని కూడా అందించకపోవడంతో నిరాశతో ఉన్నారు.

ఒక్కొక్కరికి
రూ. 2వేల విలువ చేసే కిట్లు..

గర్భిణులు, పుట్టబోయే శిశువులు పూర్తి ఆరోగ్యంగా, బలవర్ధకంగా ఉండాలనే ఉద్దేశంతో గతంలో న్యూట్రీషియన్ కిట్‌లను ప్రభుత్వం అందించింది. గత కొన్ని నెలలుగా న్యూట్రీషన్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువులు ఆరోగ్యకరంగా పెరుగుతారన్న ఆలోచనతో గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు రెండు పర్యాయాలు రూ. 2 వేల వ్యయంతో కిట్లు గతంలో అందించారు. కిట్లలో రెండు కిలోల న్యూట్రీషన్ మిక్స్‌డ్ పౌడర్, కిలో ఖర్జూర, 500 గ్రాముల నెయ్యి, ఐరన్ సిరప్ 3 బాటిళ్లు, అల్బెండజోల్ ట్యాబ్లెట్లు, ఒక కప్పు ఇతర వస్తువులు గర్భిణులకు అందేవి. ఇవి సుమారు జనవరి వరకు వచ్చాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. తదుపరి కిట్ల పంపిణీ నిలిచిపోవడంతో గర్భిణులు నిరుత్సాహంతో ఉన్నారు.

నాలుగు నెలలుగా నిలిచిపోయిన సరఫరా...
పుట్టబోయే శిశువుకు అందని పౌష్టికాహారం
జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా సర్కారు ఆసుపత్రుల్లో 939 ప్రసవాలు
గర్భిణులకు తప్పని ఎదురుచూపులు

జిల్లాలో రెండు నెలలుగా జరిగిన ప్రసవాలు ...

జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏప్రిల్, మే మాసాల్లో 939 ప్ర సవాలు జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. ఇందులో జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో 338 ప్రసవాలు జరగగా 221 సాధారణ ప్రసవాలు, 380 శస్త్ర చికిత్స ప్రసవాలున్నాయి. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలలో 338 ప్రసవాలు జరగగా 165 సాధారణ ప్రసవాలు, 234 శస్త్ర చికిత్స ప్రసవాలున్నాయి.

న్యూట్రీషన్ కిట్లకు మంగళమేనా...

జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ప్రస్తుత జూన్ వరకు సుమారు రెండు వేల ప్రసవాలు జరిగాయన్న అంచనాలున్నాయి. నాలుగు నెలల కాలంలో కొంత మంది గర్భిణులకు ఒకటి, మిగిలిన వారికి రెండు సార్లు చొప్పున న్యూట్రీషన్ కిట్లు అందాల్సి ఉంది. దాదాపుగా జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది ఉన్నట్లు అంచనా ఉంది. కొత్తగా ప్రభుత్వం న్యూట్రీషన్ కిట్లు కొనుగోలు చేయకపోవడంతో నిల్వలు అయిపోయి సరఫరాను నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. అయితే న్యూట్రీషన్ పథకానికి సర్కారు మంగళం పాడుతుందా...ఎప్పటిమాదిరిగానే కొనసాగిస్తుందా అన్న చర్చలు చోటుచేసుకుంటున్నాయి.



కిట్ల నిలిపివేతతో గర్భిణులకు అవస్థలు
డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్యే, కోరుట్ల

గర్భిణీలకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన కిట్ల పంపిణీపై నిర్లక్ష్యం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వెంటనే కిట్ల పంపిణీ జరపాలి.



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్తాం..
డాక్టర్ సమియోద్దిన్, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి

గర్భిణులకు న్యూట్రీషన్ల పంపిణీ దాదాపుగా రాష్ట్ర వ్యాప్తంగా జరగడం లేదని తెలుస్తోంది. జిల్లాలో న్యూట్రీషన్ల పంపిణీ పరిస్థితి పలువురు ఇటీవల మా దృష్టికి తీసుకవచ్చారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాము.



మాతా శిశు ఆరోగ్య కేంద్రం

బదీలీపై వెలుతున్న ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళుతున్న ఎస్పీని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

జగిత్యాల టౌన్, జూన్ 20 : జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి సూర్యాపేట జిల్లాకు బదిలీపై వెలుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌కు గురువారం జిల్లా పోలీస్ అధికారులు ఆత్మీయ విడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ అధికారులు ఎస్పీని గజమాలతో సన్మానించి పోలీస్ వాహనంలో ఎక్కించి వాహనాన్ని తాడుతో లాగుతూ ర్యాలీగా విడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం అంకిత భావంతో పనిచేసిన పోలీస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ప్రజలు ప్రశాంత వాతవరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు. 10 నెలల పాటు జిల్లాలో పని చేసే అవకాశం రావడం సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ విడ్కోలు కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వినోద్ కుమార్, భీమ్ రావు, డీఎస్పీలు రవీంద్ర కుమార్, రఘు చందర్, ఉమామహేశ్వర్‌రావు, డీసీబీ, ఎస్బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సీఐ, ఎస్సైలు ఉన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



కలెక్టర్ సత్య ప్రసాద్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న రైస్ మిల్లర్లు

జగిత్యాల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ సత్య ప్రసాద్‌కు అభినందనలు వెల్లువలా వచ్చాయి. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, వ్యాపార సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా పూల మొక్కలు, పుష్ప గుచ్చాలు అందించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేశ్, జిల్లా పారా బాయిల్డ్ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నవీన్, టీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోగ శశిధర్, మిర్యాల నాగేందర్ రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్ నాథ్ రెడ్డి, బోయినపల్లి ఆనందరావు, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ వకీలు, జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

ఇటీవల కాలంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో జరిగిన పొరపాట్లను సవరిస్తూ అర్హులకు పదోన్నతుల కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో పదోన్నతి పొంది జాయిన్ కానీ స్థానాలను గుర్తించి సంబందిత స్థానాల్లో అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతులలో జరిగిన తప్పిదాలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్, కోశాధికారి మనుపాటి బన్ని, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లను అరికట్టండి

డీఈవోకు పీడీఎస్‌యూ వినతి

జగిత్యాల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రయివేటు పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నిలిపివేయాలని కోరుతూ డీఈవో జగన్ మోహన్ రెడ్డికి గురువారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం చేశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల విద్యాశాఖ కార్యాలయంలో డీఈవోను కలిసి సమస్యను విన్నవించారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పించకుండా రూ. వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్, నాయకులు రాకేశ్, సందీప్, నవీన్ పాల్గొన్నారు.

లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మల్లాపూర్, జూన్, 20 : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం చేనేత వస్త్రాలతో పద్మశాలిలు ఎమ్మెల్యేకు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ చేసిన సేవలను అచారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు, పాల్గొన్నారు.

మళ్లీ వస్తా.. పారిశుధ్య పనులు పరిశీలిస్తా..

ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



హాజరు రిజిస్టర్‌లో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల టౌన్, జూన్ 20 : మళ్లీ వస్తా... పారిశుధ్య పనులు పరిశీలిస్తా.. ఆసుపత్రి ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంచాలి అంటూ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రి శానిటేషన్ విభాగం పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. ఐసీయూ, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్, సీటి స్కాన్, స్కానింగ్ రూం, ఎక్స్‌రే, ఓపీ, ఆరోగ్యశ్రీ తదితర వార్డుల్లో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో ప్రైవేటు జీవధార మందుల దుకాణం ఏర్పాటుపై వైద్యులను అడిగి తెలుసుకుని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. శానిటేషన్ పనుల నిర్వాహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల కు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు అంకిత భావంతో పని చేయాలన్నారు. వైద్య విదాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబం ధించి డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్ నిధులు పక్కదారి విషయంలో అవినీ తికి పాల్పడ్డ వారిపై తగిన చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు, ఆర్ఎంవో రాజేంద్ర ప్రసాద్, ఆర్డీవో మధుసూధన్ గౌడ్, అర్బన్ తహసీల్దార్ వరందన్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన డీఏవో

ధర్మపురి, జూన్ 20: ధర్మపురి మండలంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి వాణి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె షాపుల్లో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, రిజిష్టర్ల నిర్వహణ ఎలా ఉందో తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. అలాగే ఎరువులు, విత్తనాల గోదాంలను కూడ ఆమె పరిశీలించారు. అలాగే ఆమె క్షేత్ర స్థాయిలో పంటల వివరాలు నమోదు వెరిఫికేషన్ చేశారు. ఆమె వెంట ధర్మపురి క్లస్టర్ ఏఈవో నవ్య పాల్గొన్నారు.

బీర్‌పూర్: నేలలో తేమ శాతం ఉన్నప్పుడే విత్తనాలను విత్తుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని పంట చేల్లను పరిశీలించి, మట్టి నమూనాలను తీసే మెలుకువలను, ఎరువుల మోతాదు వాటి వాడకం ప్రాధాన్యతను రైతులకు వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ నేలలో తేమ శాతం ఉన్నప్పుడే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి అనూష, ఏఈవోలు సందీప్, శిరీష, సీఈవో తిరుపతి, రైతులు కృష్ణ రావ్ ఉన్నారు.



మట్టి నమూనాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

నులి పురుగులను నులిపేద్దాం

జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్

జగిత్యాల టౌన్, జూన్ 20 : నులి పురుగులను నులిపేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వైద్యాధికారి సమీయొద్దిన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి ప్రారంభించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

కొడిమ్యాల, జూన్ 20 : మండలంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం ఈ నెల 21న శుక్రవారం రానున్నట్లు ఎంపీపీ స్వర్ణలత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం చేస్తారన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల సర్వ సభ్య సమావేశంలో పాల్గొంటారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జగిత్యాలలో నిత్య యోగా వైపు పరుగులు
● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవ



యోగా శిక్షణలో ఆసనాలు వేస్తున్న ప్రజలు(ఫైల్)

జగిత్యాల టౌన్, జూన్ 20: ఉరుకులు.. పరుగుల జీవితం.. పెరుగుతున్న పని ఒత్తిడి... మానసిక ఆందోళనలతో పలు రకాల ఆరోగ్య సమస్యలు మనిషిని చుట్టుముడుతున్నాయి. శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడంతో వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దీని నుంచి తప్పించుకునేందుకు వ్యాయామాన్ని ఎంచుకుంటున్నారు. అయినా బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులు నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోతున్నారు. అయితే ఈ వ్యాధులన్నీ యోగా సాధన ద్వారా దూరమవుతాయని గ్రహించిన జగిత్యాల జిల్లా కేంద్ర ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు యోగా పట్ల ఆకర్షితులవుతున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా వందలాది మంది శిక్షణకు హాజరై సాధన చేస్తున్నారు.

● జగిత్యాలలో నిత్య యోగా వైపు పరుగులు..

జగిత్యాల జిల్లా కేంద్రంలోని రాంబజార్‌లో ప్రముఖ యోగా గురువు గంప ప్రదీప్, ఉపాధ్యాయుడు నర్సింగారావు, లడ్డు ఖాజా చౌరస్తా సమీపంలో మరో ఉపాధ్యాయుడు విజయ్ గోపాల్ ఆధ్వర్యంలో నిత్య యోగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రజలు యోగా వైపు ఆకర్షితులై పలు ఆసనాలు నేర్చుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం వైపు అడుగులు వేస్తున్నారు. మినీ స్టేడియంలో యోగా గురువు నలమాసు వాసు, కరీంనగర్ రోడ్డులో యోగా గురువు పూటూరి గౌరీ శంకర్, కృష్ణానగర్‌లో ఉప్పుగండ్ల రమణయ్య, అరవింద్‌నగర్‌లో కేఎల్‌వీ కృష్ణ ఆధ్వర్యంలో ధ్యాన కేంద్రాలు ఉన్నాయి. నిత్యం ఈ శిక్షణకు జిల్లా కేంద్ర ప్రజలతో పాటు ప్రముఖులు ఉదయం 5 గంటల నుంచి 6:30 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు హాజరవుతూ యోగా తరగతుల్లో పాల్గొంటున్నారు. ఇందులో శరీరాన్ని, మనస్సును చైతన్యపరిచేందుకు వివిధ వ్యాయామా లను యోగా గురువు ప్రదీప్ శిక్షణకు హాజరయ్యేవారికి అందజేస్తున్నారు. వీటితో పాటు రాజ యోగ ప్రాణాయమాలు చేస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచి జీర్ణ క్రియను పటిష్టపరిచి మలబద్ధకాన్ని నివారించేందుకు ప్రకృతి సిద్ధమైన కూరగాయలు, పండ్లు, ఫలాలు యోగా శిక్షణలో అమృతాహారంగా అందిస్తున్నారు.

● ఆసక్తి కనబరుస్తున్న ప్రజలు..

రెండేళ్ల క్రింతం కొవిడ్ ప్రభావంతో ఎన్నో కుటుంబాలు కకలావికాలమ య్యాయి. దీంతో ప్రజలు నిత్య వ్యాయాయం వైపు ఆకర్షితులై బలాన్ని పెంచుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. నిత్యజీవితంలో తమ కార్యచరణను పూర్తిగా మార్చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామానికి తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. అంతేకాకుండా తమ ఆహారపు అలవాట్లను కుడా పూర్తిగా మా ర్చుకుని వ్యాధులు దరిచేరకుండా చిన్నపిల్లల నుంచి 60 సంవత్సరాలు దాటిన వారు కుడా వ్యాయామం వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. పట్టణాలతో పల్లెల్లో కూడా జనం నిత్య యోగా వైపు అడుగులు వేస్తున్నారు. పట్టణంలోని క్రీడా మైదానాలతో పాటు పాఠశాలల మైదానాలు, ఓపెన్ జిమ్‌ల వద్ద వేకువజాము నుంచే ప్రజలు బారులు తీరుతూ వ్యాయామాలు చేస్తున్నారు.



ప్రతి ఒక్కరికీ యోగా అవసరం..
డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల

మారుతున్న ఆహారపు అలవాట్లకు ప్రతి ఒక్కరికీ యోగా ఎంతో అవసరం. మానసిక ప్రశాంతతో పాటు చురుకుగా తయారవుతాం. జ్ఞాపక శక్తి పెంపొందుతుంది. ఆహారపు అలవాట్లలో మార్పులు చోటు చేసుకుంటాయి. కొవిడ్ సమయంలో ఎంతో మంది బలహీనత వల్ల మృత్యువాత పడ్డారు. నిత్యం ఉదయం, సాయంత్రం నడక ఉత్తమం.

మానసిక ప్రశాంతత పెరుగుతుంది...
గంప ప్రదీప్, యోగా గురువు, జగిత్యాల



యోగా అభ్యాసం చేయడంతో మానసిక ప్రశాంతతో పాటు ఆధ్యాత్మిక అభివృద్ధి చెందుతుంది. యోగాతో ఆనందం, సంపూర్ణ ఆరోగ్యం, పరిపూర్ణ ఆయుష్షు క లుగుతుంది. రోజు గంట యోగాకు కేటాయిస్తే ప్రతి వ్యక్తి ఆరోగ్యకరంగా ఉంటారు. ఎంత బిజీ సమయం ఉన్నా కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలి.

ఘనంగా పోచమ్మ బోనాల పండగ

గొల్లపల్లి, జూన్ 20 : మండలంలోని భీంరాజ్ పల్లె గ్రామంలో పోచమ్మ బోనాల పండగను గ్రామస్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపావాస దీక్షలతో ప్రత్యేకంగా వండిన బోనాలను మహిళలు నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాల నడుమ పోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భగుడిలోని గ్రామ దేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని, గొడ్డుగోదా, పిల్లాజెల్లా సల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్ పాల్గొన్నారు.

తేనేటీగల దాడిలో గాయాలు

మల్యాల, జూన్ 20: వనభోజనాలు వెళ్లిన పలువురిపై తేనెటీగలు దాడి చేయడంతో గాయాలపాలయ్యారు. మల్యాలకు చెందిన పోచయ్య అనే వ్యక్తి కుటుంబసభ్యులు గురువారం వనభోజనాల కోసం మల్యాల శివారులోని బీసీ వసతిగృహం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఓ చెట్టు కింద కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి వంటలు తయారి చేస్తుండగా వెలువడిన పొగతో చెట్టుపై గల తేనేటీగలు లేచి అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మల్యాల, జూన్ 20: మల్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. తమ ప్రభుత్వం త్వరలోనే కల్యాణలక్ష్మి పథకంలో బంగారం కూడా అందించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆగంతపు రవళి, తహసీల్దార్ మునీంధర్, ఆర్ఐ తిరుపతి నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, వీర బత్తిని శోభరాణీ, పోతాని రవి, వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నేరెల్ల సతీష్‌రెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, వంశీధర్, మ్యాక లక్ష్మన్, మంద తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఇసుక లారీ పట్టివేత

గన్నేరువరం, జూన్ 20: తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామ శివారు లో అక్రమంగా ఇసుకను డంపు చేసి ఎక్స్‌కావేటర్ సహాయంతో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న తరలిస్తున్న లారీని గురువారం మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లారీని, ఎక్స్‌కా వేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కోరపు సంపత్‌రెడ్డి, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్ మెండ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకు న్నారు. లారీ యజమాని కొండుగారి తిరుపతిరెడ్డి, ఎక్స్‌కావేటర్ యజమాని గూడెల్లి నరేష్, ఇసుక డంపు చేయించిన చింతల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం,జూన్20: ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామంలో గురువారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నర్సింహులపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో 100క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ చెప్పారు. పంచనామా చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యంను భద్రపరిచినట్లు తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు ఉన్నారు.

పీజీ పరీక్ష రుసుం గడువు 28 వరకు

గణేశ్‌నగర్,జూన్ 20: ఎం.ఏ, ఎం.కాం, ఎమ్మెస్సీ, ఎం.ఎస్.డబ్ల్యూ,ఎం.బీఏ, ఎం.సీ.ఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 28వ తేదీ వరకు తుది గడువు అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300/- రూపాయల అపరాధ రుసుంతో జూలై నెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, మొత్తం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడి మృతి


పోచయ్య(ఫైల్)

వేములవాడ రూరల్, జూన్ 20: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నూకలమర్రి గ్రామానికి చెందిన గసికంటి పోచయ్య(63) గ్రామ పంచాయతీలో తాత్కాలిక కార్మికుడిగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. గురువారం చెత్త సేకరణలో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్తుండగా మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో పోచయ్య ట్రాక్టర్ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో గమనించిన స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కార్మికులు కోరుతున్నారు. కాగా మృతుడు గసికంటి పోచయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 50,000 రూపాయల చెక్కును రూరల్ తహసీల్దార్ సుజాత ద్వారా అందజేశారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- సీఐటీయూ, ఏఐటీసీయూ ధర్నా


డీపీఎల్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సిరిసిల్ల టౌన్: నూకలమర్రి గ్రామ పంచాయతీ కార్మికుడు గసికంటి పోచయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా ప్రధాన వైద్యశాల ఆవరణలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎల్‌పీవో నరేష్ సీఐటీయూ, ఏఐటీయూసీ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడారు. పోచయ్య కుటుంబానికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో నరేష్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దహన సంస్కారానికి రూ.10 వేలు అందజేశారు. నష్టపరిహారంగా ఐదు లక్షల రూపాయల వరకు అందించేలా చూస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం డీఎల్‌పీవో నరేష్‌కు కార్మిక సంఘాల నాయకుడు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, గంగరాజు, మహేష్, శ్రీనివాస్, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో కారు (టీఎస్11ఈజే3274) అతి వేగంతో చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడ్డ నీలాంబర (38) అనే వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలానికి చెందిన ముక్కిస నీలాంబర అనే వ్యక్తి బుధవారం ముదిమాణిక్యం నుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నీలాంబర భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

వీణవంక, జూన్ 20: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వీణవంక మండలంలోని మామిడాలపల్లికి చెందిన సింగరవేని తిరుపతి (33) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి హార్వెస్టర్ నడుపుతూ జీవించేవాడని మద్యానికి బానిసై 15వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.మృతుని భార్య రక్షిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్,జూన్ 20: కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ (20) సబ్బితం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం అక్షయ్ కుమార్ తన గ్రామం నుంచి పెద్దపల్లికి ప్రతి రోజు వస్తుంటాడు. బుధవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి తెలిపారు.



ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూన్ 20: సుల్తానాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రామానికి చెందిన బాబురావు సోదరి నిర్మల మండలంలోని నీరుకుళ్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అమె ఆత్మహత్యకు భర్త కారణమంటూ మృతురాలి సోదరుడు బాబురావు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులతో చర్చలు జరుగుతున్నాయి. నష్టపరిహారం కోసం మాట్లాడుతున్న సందర్భంలో బాబురావు తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న గడ్డిమందు డబ్బా మూత తీసి అందరి ముందే తాగాడు.

అక్కడున్న వారు వెంటనే అతని చేతిలో నుంచి డబ్బా లాగి పడేసి అతన్ని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనం తరం కరీంనగర్ తరలించారు. తన సోదరి విషయంలో కేసు నమోదులో జాప్యం జరుగుతుండటం, న్యాయం జరిగే అవకాశం లేదని అనుకున్న బాబురావు ఆత్మహత్యయత్నం చేశాడు. అయితే నీరుకుళ్ల మహిళ ఆత్మహత్య కేసులో గురువారం సాయంత్రమే ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీడీ టేకేదార్ మృతి


మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బీడీ టేకేదార్ ఊరడి మహేశ్(37) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతని పైనుంచి కంటైనర్ వాహనం పోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని విజయ-వరస్వామి దంపతుల పెద్ద కొడుకు మహేశ్ స్థానికంగా బీడీ కంపెనీ నిర్వహిస్తూ జీవిస్తుండేవాడు. గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు ప్రయాణిస్తున్న కంటైనర్ వాహనం బైక్‌ను ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. మహేశ్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోధించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కంటేనర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లిదండ్రులు విజయ, వరస్వామి, భార్య లావణ్య కూతురు లాస్య, కొడుకు మనోజ్ ఉన్నారు.


రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావ్య

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టడంతో పాటు మరో బైక్‌ను ఢీకొన్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని అర్బన్ పార్కు వద్ద గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వాహనాలను ఢీకొట్టిన యువకుడు రాజేశ్‌ను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పదిర గ్రామానికి చెందిన రేండ్ల దేవరాజు తన భార్య కావ్య, కూతురు రియాన్ష్‌లతో కలిసి తన బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు మద్యం మత్తులో బైక్‌పై అతివేగంగా దూసుకుపోయిన యువకుడు రాజేశ్ ముందుగా దేవరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. వారి వెనుక వస్తున్న గొల్లపల్లిలోని డిగ్రీ విద్యార్థులు ఇరుముల శ్రీమాంత్, వంశీల వాహనాన్ని ఢీకొట్టి ముందుకు పోయాడు. దేవరాజు, కావ్య, రాజేశ్, శ్రీమాంత్, వంశీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో చిన్నారి రియాన్ష్ బయటపడింది. కేసు నమోదు చేనట్లు పోలీసులు వివరించారు.







ఇద్దరు దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 20: కరీంనగర్‌లోని మెహర్‌నగర్‌లో ఈ నెల 15న చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేశామని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. మెహర్‌నగర్‌కు చెందిన సందూరి లక్ష్మి మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయిన నిందితులు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న పున్నం శ్రీనివాస్, సాయినగర్‌కు చెందిన అందె శ్రీనివాస్‌లను ఆదర్శనగర్‌లో అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎస్సై

తిమ్మాపూర్, జూన్ 20: మండలంలోని రేణికుంట సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్ఎండీ పోలీసులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. రేణికుంట గ్రామ శివారులో నిల్వ చేసిన సుమారు 20ట్రాక్టర్లకుపైగా ఉన్న ఇసుక డంపులను కూడా స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖకు అప్పగించామని ఎస్సై చేరాలు తెలిపారు.

హోటళ్లు, హాస్పిటల్స్‌పై బల్దియా అధికారుల దాడులు

కరీంనగర్ టౌన్, జూన్20: నగరంలోని పలు హోటళ్లు, హాస్పిటళ్లపై నగర పాలక సంస్థ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం నాలుగు హోటళ్లు, రెండు హాస్పిటల్స్‌ను అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్‌ను పాటించకపోవడం, ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించిన సంస్థల నుంచి 9,500 రూపాయల జరిమానా వసూలు చేశారు. తిరిగి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప రంగా శిక్షిస్తామని అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరించారు.

అత్యాచారయత్నం చేసిన వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, జూన్ 20: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామానికి చెందిన ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ట్రాన్స్‌కో ఉద్యోగి షాబుద్దీన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గోదావరిఖనికి చెందిన సదరు మహిళ కొంతకాలంగా గ్రామంలో టైలరింగ్ పనిచేసుకుంటూ నివాసం ఉంటోంది. ఈ క్రమంలో షాబుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహితపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని విషయాన్ని బంధువులకు తెలిపింది. వివాహిత ఫిర్యాదు మేరకు షాబుద్దీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో చట్టం కింద ఒకరి అరెస్టు

మెట్‌పల్లి, జూన్, 20 : పట్టణానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బత్తిని నవదీప్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణ అనుసంధాన గ్రామమైన ఆరపేటకు చెందిన బత్తిని నవదీప్ పట్టణానికి చెందిన బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఈ నెల 12న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఈడీని కలిసిన రీజియన్ మేనేజర్లు


ఆర్టీసీ ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రీజినల్ మేనేజర్‌లు

భగత్‌నగర్, జూన్ 20: వరంగల్, ఖమ్మం రీజియన్‌లకు నూతన రీజినల్ మేనేజర్లుగా నియమితులైన డి విజయభాను, ఎ సరిరాంలు బుధవారం కరీంనగర్‌లోజోన్ ఈడీ సి వినోద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రీజినల్ మేనేజర్‌లుగా పదోన్నతి పొందిన ఇద్దరిని జోన్ ఈడి వినోద్‌కుమార్ అభినందించారు. డి విజయభాను గతంలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్‌గా), ఎ సరిరాం రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా పనిచేశారు.

ఆర్టీసీ కరీంనగర్ ఒకటో డీఎం సస్పెన్షన్

భగత్‌నగర్, జూన్ 20: కరీంనగర్ వన్ డిపో మేనేజర్ లక్కు మల్లేశంను ఆర్టీసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఈడీ వినోద్‌కుమార్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కామారెడ్డి డిపో నుంచి కరీంనగర్ వన్ డిపోకు మేనేజర్‌గా దాదాపు ఏడాదిక్రితం వచ్చిన మల్లేశంపై ఫిర్యాదులు రావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెబుతున్నారు. సస్పెండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

ఒకరిపై దాడి.. ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఇల్లు పంపకం విషయంలో తలెత్తిన వివాదంలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన కుంభాల లక్ష్మారెడ్డిపై దాడి చేసిన సంఘటనలో అదే గ్రామంలోని కుంభాల సత్యంరెడ్డి, అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ కిషన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి మధ్య తాతలు సంపాదించిన ఇల్లు విషయంపై గొడవలు జరుగుతున్నాయి. తమను మోసగించి సత్యంరెడ్డి తన పేరిట చేయించుకున్నాడని లక్ష్మారెడ్డి పేర్కొంటున్నారు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా ఇల్లు వాటా కింద సోదరుడు లక్ష్మారెడ్డికి రూ.5 లక్షలు చెల్లిస్తానని అంగీకరించారు. యేడాది కిందట సత్యంరెడ్డి రూ.2లక్షలు మధ్యవర్తి ఎలుసాని మల్లారెడ్డికి అప్పగించాడని చెప్పారు. దాంట్లో నుంచి రూ.10 వేలు పట్టుకుని మిగతా డబ్బులు లక్ష్మారెడ్డికి ముట్టజెప్పాడని పేర్కొన్నారు. యేడాది గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 20న మల్లారెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లక్ష్మారెడ్డి కోరాడని తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సత్యంరెడ్డి అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలు అడ్డగించి కర్రలతో దాడికి దిగారని లక్ష్మారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడని పేర్కొన్నారు. బాధితుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు సత్యంరెడ్డి, మయూరి, మల్లారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ కిషన్‌రావు వివరించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



మెట్‌పల్లిలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

మెట్‌పల్లి, జూన్ 20: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మెట్‌పల్లి డిగ్రీ, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్, వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా గురువారం ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ బోధనతో పాటు బీఏ, బీకాం తరగతులు సక్రమంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. డిగ్రీ కళాశాలలో గ్రూపుల వివరాలు, ఎన్ఎస్ఎస్ సర్వీసులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ప్రైవే టు కళాశాలలో చేరి ఫీజులతో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం వెంకయ్య, జగపతి, నర్సయ్య, వెంకన్న, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్,ఎస్పీని కలిసిన జువ్వాడి


కలెక్టర్, ఎస్పీని కలిసి సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు నర్సింగరావు

కోరుట్ల, జూన్ 20: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బుదుమజ్జి సత్యప్రసాద్, ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆశోక్‌కుమార్‌ను గురువారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కలెక్టర్ కార్యాలయంలో సత్య ప్రసాద్‌ను ఎస్పీ కార్యాలయంలో ఆశోక్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేసి ప్రత్యేకంగా అభినందిచారు.

కథలాపూర్: బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను గురువారం తన చాంబర్‌లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఆయన వెంటన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్‌రావు ఉన్నారు.

సామాజిక సేవకులు జర్నలిస్టులు

రాయికల్, జూన్ 20: నిరంతర సామాజిక సేవకులుగా జర్నలిస్టులు పని చేస్తున్నారని రాయికల్ మండల ప్రెస్ క్లబ్ (జేఏసీ) అధ్యక్షుడు వాసరి రవి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో గురువారం వర్కింగ్ జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ పాలసీ కార్డులను పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన వ్యక్తిగత వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు విలువ గల పోస్టల్ పాలసీ కార్డులను సబ్ పోస్ట్ మాస్టర్ బి.రాజు, ప్రెస్‌క్లబ్ నాయకుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, కోశాధికారి మచ్చ శేఖర్, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రఘుపతి, సాయికుమార్, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, డాక్ సేవక్ ఉమామహేష్ పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

కోరుట్ల, జూన్ 20: వయోవృద్ధుల వేధింపు నివారణ చట్టంపై అవ గాహన కలిగి ఉండాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ సంఘ కార్యాలయంలో గురువారం ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం వార్షికోత్సవంలో భాగంగా రక్షణ, పోషణ, సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 2007 నియమావళి 2011లో కూడిన అవగాహన కరపత్రాన్ని సంఘ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. తల్లి దండ్రులను వేధిస్తున్న వారికి నియమావళిపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌లో వినని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సంబధింత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పబ్బా శివానందం, ఎండి యాకూబ్, ప్రకాష్ రావు, రాజ్‌మోహన్, లక్ష్మినారాయణ, సైఫోద్దిన్, ఎన్నం గంగాధర్, గఫార్, దర్శనాల ఆనంద్, రాజయ్య, దోనూరి భూమాచారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

కోరుట్ల, జూన్ 20: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నామని, దీని కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. 22 నుంచి 25వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఆయన తెలిపారు. కోరుట్ల పాలిటెక్నిక్ కళాశాల ఏరియా అయిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. క్వాలిఫైయి అయిన విద్యార్థులు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ, టీసీ, ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్లలతో పాటు జిరాక్స్ కూడా వెంట తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు తన స్వంత మొబైల్‌లో మాత్రమే లాగిన్ అవ్వడం ఉంటుందని సర్టిఫికెట్ల పరిశీలన తరువాత ఈ నెల 22 నుంచి 27 తేదీ వరకు కాలేజీ కోర్సుల దరఖాస్తుల నమోదు సెల్ ద్వార పొందవలసి ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు గమనించి స్లాట్ బుక్ చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకున్న మహిళలు

- సర్కారు బడికి పంపుతామని నిర్ణయం

కథలాపూర్, జూన్ 20: రోజు రోజుకూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి తమ సర్కారు బడి మూత పడే ప్రమాదం ఉందని బడిని బతికించుకుం దామనే ఆలోచనతో మండలంలోని పెగ్గెర్ల గ్రామస్థులు ప్రైవేట్ పాఠశాలల బస్సులను నిలిపి వేశారు. గురువారం ఉదయం గ్రా మ సమీపంలోని వరద కాలువ వద్ద కథలాపూర్, కోరుట్ల నుంచి వచ్చిన ప్రైవేట్ పాఠశా లల బస్సులను తమ గ్రామానికి రావద్దని అడ్డుకున్నారు. మహిళలు మూకుమ్మడిగా గ్రామంలోని ప్రభుత్వ బడిలోకి పిల్లలను పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం పెగ్గెర్లలో ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం 30 మందికి మించి విద్యార్థులు లేకపో వడంతో మూత పడే పరిస్థితికి చేరుకుంది. దీంతో పిల్లలను గ్రామంలోనే చదివించి పాఠశాలను మూత పడకుండా కాపాడుకుంటామని గ్రామస్థులు తెలిపారు. ప్రజలు అడ్డుకోవడంతో ప్రైవేట్ పాఠశాలల బస్సులు వెనుదిరిగిపోయాయి.

రైతుల సంక్షేమమే మోదీ ధ్యేయం

- బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, జూన్ 20: రైతుల సంక్షేమమే ధ్యేయంగా దేశ వ్యాప్తంగా ప్రధానంగా పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో రైతు బాంధవుడుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిలిచారని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పండించే 14 రకాల పంటలకు కేంద్ర కేబినెట్‌లో మద్ధతు ధర పెంచడం కోసం తీసుకన్న నిర్ణయం హర్షనీయమన్నారు. తెలంగాణలో ప్రధాన పండించే వరి క్వింటాల్‌కు రూ. 117లు, మొక్కజొన్నకు రూ. 135లతో పాటు ఇతర పంటలకు మద్ధతు ధరలు పెంచడం సంతోషకరమని తెలిపారు. రైతులకు లబ్ధి చేకూర్చిన ప్రధాని మోదీకి అభినందనలు తెలయజేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, జూన్ 19 : విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించే విధంగా ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని పైడిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి సమియెద్దిన్‌లతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మండల మెడికల్ అధికారి సమీన తబస్సుమ్, సూపర్ వైజర్లు హరినాయక్ మురళి, ధనుంజయ్ విద్యార్థులకు నులిపురుగు వ్యాప్తి వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, ఎంపీటీసీ మాధురి, పాఠశాల ప్రదానోపాధ్యాయుడు చిరుమల్ల ఆనంద్, సింగిల్ విండో చైర్మన్ జగన్‌మోహన్ రావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్‌లతో పాటు పలవురు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెం డజోల్ మాత్రను అందించారు. నులి పురుగు నిర్మూలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాలలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్ వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగు నివారణకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీపీ మారు సాయిరెడ్డి, మండల వైద్యధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మెట్లచిట్టాపూర్, వెల్లుల్ల గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి : మండలంలో గురువారం నిర్వహించిన నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతమైనట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేష్ తెలిపారు. మండలంలోని 23 గ్రామాలలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మాత్రల పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ గోళి శోభాసురేందర్‌రెడ్డి మాత్రల పంపిణీ ప్రారంభించగా సింగిల్ విండో చైర్మన్ ఓరుగంటి రమణారావు, ఎంఈవో శ్రీనివాస్, వైద్యాధికారులు నరేష్, రమ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


ఆల్బెండ జోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా వైద్యాధికారి

వెల్గటూర్: నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ లక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, అంబారిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి లవకుమార్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి విజయ్, ఎంపీవో శ్రీనివాస్, సూపర్‌వైజర్‌లు చంద్రలీల, శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అండాలు, ఏఎన్‌ఎం జయప్రద, ఆశాలు విజయ, వారధ, భాగ్య పాల్గొన్నారు.

ధర్మపురి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నెలలకు ఒక సారి ప్రతి సంవత్సరం రెండు సార్లు నులి పురుగుల దినం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అవంతి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, గరిగె అరుణ, హెచ్‌ఎం కె. శ్రీనివాస్, జిల్లా పర్యవేక్షకులు శ్రీధర్, సీహెచ్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో అల్బెండోజాల్ మాత్రలను మండల వైద్యాధికారి పరమేశ్వరీ ఆధ్వర్యంలో సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు నవనీత, శ్రావణ్, హెల్త్ సూపర్‌వైజర్లు అలివేలు, వెంకటనర్సమ్మ, హెల్త్ అసిస్టెంట్లు వేణు, లచ్చయ్య, సుదర్శన్, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మెట్‌పల్లి : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్, డాక్టర్ వాణి ఆల్బెండజోల్ మాత్రలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, జన్నార్దం, హెల్త్ సూపర్ వైజర్ శారద, ఏఎన్‌ఎం లాస్య, ఆశా వర్కరు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: విద్యార్థులకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మల్లాపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, డీలర్ మల్లయ్య, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: చిన్నారుల్లో సంక్రమించే నులి పురుగుల నివారణకు కృషి చేయాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనురాధ, మండల వైద్యాధికారి సతీష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గట్టు రమేష్ పాల్గొన్నారు.

మల్యాల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మల్యాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థులకు అల్బెండజోలు మాత్రలు వేశారు. మల్యాలలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మండల వైద్యాధికారి మౌనిఖ, ఎంపీపీ ఆగంతపు రవళి, డీపీఎంవో దేవ్‌సింగ్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఆగంతపు వంశీ, లక్ష్మన్, ప్రశాంత్ పాల్గొన్నారు

గొల్లపల్లి : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల విద్యాలయంలో జాతీయ నులిపు రుగు నివారణ కార్యక్రమంను ఎంపీపీ నక్క శంకరయ్య ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో మండల వైద్యాధికారి డా. నరేష్ తెలిపారు, సీహెచ్‌వో శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్లు నరేందర్, రమేష్, శారద, ద్వారక, హెల్త్ అసిస్టెంట్లు వేణు గోపాల్, సత్యానారాయణ, ఏఎన్‌ఎమ్‌లు పుష్ప, నిర్మల, రజిత పాల్గొన్నారు.


ధర్మపురి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ..


మల్యాలలో మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే


వెల్గటూర్‌లో మాత్రలు వేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జిల్లా ఉప వైద్యాధికారి

ప్లీజ్ మేడం..వెళ్లొద్దు

● ఉపాధ్యాయురాలి బదిలీ.. ● కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు

ఎండపల్లి, జూన్ 20: 'ప్లీజ్ మేడం మీరు వెళ్లొద్దు..ఇక్కడే ఉండి మాకు పాఠాలు చెప్పండి ప్లీజ్..అంటూ పదో తరగతి విద్యార్థినులు ఓ ఉపాధ్యాయురాలి వద్ద కన్నీళ్లు పెట్టుకున్న ఘటన ఇది. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో రెండు సంవత్సరాలుగా సుమతారాణి తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. విద్యార్థులతో ఆప్యాయంగా ఉంటూ పాఠాలు చెబుతుండటంతో ఉపాధ్యాయురాలిపై మమకారం పెంచుకున్నారు. అయితే ఆమె ఇటీవలే పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామానికి బదిలీ అయ్యారు. బదిలీలో భాగంగా గురువారం పాఠశాల నుంచి సుమతారాణి రిలీవ్ కావడంతో విద్యార్థినులు కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థుల స్పందన చూసి ఉపాధ్యాయురాలు కూడా తీవ్ర భావోద్వేగానికి గురై వారిని ఓదార్చారు. వీలున్నప్పుడల్లా పాఠశాలకు వస్తుంటానని మంచిగా చదువుకుని ఉన్నత స్థానానికి రావాలని విద్యార్థినులకు ధైర్యం చెప్పి వెళ్లిపోయారు.


విద్యార్థినులను ఓదార్చుతున్న ఉపాధ్యాయురాలు

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, జూన్ 20 : ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వైద్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని చికిత్సకు వచ్చే వారి ఓపి రికార్డును పరిశీలించి వైద్య సేవలు గురించి ఆరా తీసారు. ఆసుపత్రిలో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహిస్తున్న చికిత్స వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఉన్న డ్యూటీ డాక్టర్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు ఎమ్మెల్యే వారికి వివరించారు. డయాలసిస్ కేంద్రంలో మరో ఐదు బెడ్‌లు ప్రభుత్వ కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరిడెంట్ సునితా రాణి, కౌన్సిలర్ జిందం లక్ష్మినారాయణ, ప్రభులతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించడం లేదని ఎస్ఈకి ఫిర్యాదు

వెల్గటూర్, జూన్ 20: శాఖాపూర్, కాలేశ్వరం లింక్-2 పనుల్లో విద్యుత్ పనులు పూర్తి చేసినా ధర్మపురి ఏడీఈ బిల్లులు చెల్లించడం లేదని ఎస్ఈకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు గుత్తేదారు సాన రఘు తెలిపారు. ధర్మపురి ఏడీఈ పరిధిలోని వెల్గటూర్, రాజారాంపల్లి సెక్షన్‌లో మహాలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ ద్వారా విద్యుత్ పనుల నిమిత్తం ఒప్పందం కుదుర్చుకొని పనులు పూర్తి అయిన త రువాత బిల్లు పెట్టమని అడిగితే ఏడీఈ దురుసుగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ సంస్థకు నష్టం కలిగిస్తున్న ఏడీఈపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన ఎంపీపీ

మల్యాల, జూన్ 20: మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఎంపీపీ ఆగంతం రవళి పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సరితా దేవి, అధ్యాపకులతో పాటు నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వంశీధర్, మిట్టి శ్రీనివాస్, కట్కూరి ప్రశాంత్ పాల్గొన్నారు

● అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మల్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం-3ను ఎంపీపీ రవళి తనిఖీ చేశారు. లబ్దిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసిన ఎంపీపీ పౌష్టికాహారం పంపిణీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సక్రమంగా అందించాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ రాజశ్రీ ఎంపీపీ వెంట ఉన్నారు

● పారిశుధ్యంపై దృష్టి సారించాలి

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ రవళి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి వాణీ, ఎంపీడీవో స్వాతి పాల్గొన్నారు

వర్షాకాలంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

రాయికల్, జూన్ 20: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం అన్నారు. మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విపత్తు నిర్వహణ మండల స్థాయి కమిటీతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తెగిపోయే అవకాశం ఉన్న రోడ్లు, కల్వర్టులు, చెరువులు, కుంటలు గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు పూర్తిగా నిండిపోవడం వలన బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి కూల్చివేసి నిర్వాసితులను వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామ ప్రజలను అప్రమత్తం చేసి ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మురికి కాలువలను క్రమం తప్ప కుండా శుభ్రం చేయాలని, శానిటైజేషన్ పనులను తూచా తప్పకుండా చేపట్టాలని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు జారీ చేయాలన్నారు. సీజనల్ అంటు వ్యాధులు ప్రబలకుండా మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కె.సుష్మా, వైద్యాధికారి సతీష్ కుమార్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ సీవీ ప్రసాద్, ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్ అర్జున్, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ ధనుంజయ్, ఎస్సారెస్పీ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వేణుమాధవ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా నర్సయ్య

ధర్మపురి, జూన్ 20: లయన్స్ క్లబ్ ధర్మపురి నూతన అధ్యక్షుడిగా రాపర్తి నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీ భవన్‌లో గురువారం లయన్స్ క్లబ్ సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాపర్తి నర్సయ్య, సెక్రటరీగా స్తంభం కాడి రమేష్, ట్రెసరర్‌గా సిరుపతి రాజన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిస్ట్రిక్ట్ 320జీ మొదటి ఉప గవర్నర్ లయన్ కోదం దరాములు వారం దరిచే పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016-17లో జక్కు రవీందర్ ఆధ్వర్యంలో 22 మంది సభ్యులచే ప్రారంభమైన ఈ లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే లయన్ చెన్నమనేని సుధీర్‌రావు, అల్లాడి ప్రవీణ్, టీ. రాజేందర్, జడ్‌సీ లయన్ డాక్టర్ రామకృష్ణ, చార్టెడ్ ప్రెసిడెంట్ లయన్ జక్కు రవీందర్, సాయిని సత్యనారాయణ, మునీందర్‌రెడ్డి ధర్మపురి క్లబ్ పక్షాన చేసిన సేవలను కొనియాడారు. క్లబ్‌లో నూతనంగా గట్ల శ్రీనివాస్, మంతెన శ్రీనివాస్, శ్రీకర్, చొప్పరి శ్రీనివాస్‌ను సభ్యులుగా చేర్చుకున్నారు.



నూతన అధ్యక్షులు రాపర్తి నర్సయ్యను మెమెంటోతో అభినందిస్తున్న సభ్యులు

తుర్క కాశీనగర్‌లో పాఠశాల ఏర్పాటు చేయిస్తా

ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జూన్ 20 : జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి అనుబంధ గ్రామం తుర్క కాశీనగర్‌లో పాఠశాల ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి విద్యార్థులకు భరోసా కల్పించారు. గురువారం విద్యార్థులు పాఠశాలకు నడుచుకుంటూ కాలినడకన వెళ్తున్న విద్యార్థులను అటు వైపు వెళ్తున్న ఎమ్మెల్సీ గమనించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలోనే తుర్కాశీనగర్ గ్రామా న్ని సందర్శించి పాఠశాల ఏర్పాటు చేయిస్తానని అన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హా మీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్, జూన్ 20 : ఈ నెల 21న మండలంలోని అంబారిపేట, కథలాపూర్, భూషణరావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈలు జమీల్ పాషా, భూమేశ్వర్ తెలిపారు. అంబారిపేట, భూషణరావుపేట పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట దాకా, కథలాపూర్, బొమ్మెన సబ్ స్టేషన్ల పరిధి లోని గ్రామాల్లో 11.30 గంట నుంచి ఒంటి గంట దాకా విద్యుత్ నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వార్షిక మరమ్మత్తుల నేపథ్యంలో ఏర్పడుతున్న అంతరాయంకు రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్దతు ధరల పెంపుపై హర్షం

కథలాపూర్, జూన్ 20 : కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం పట్ల బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నరేంద్ర మోదీ నిరంతరం రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్నారని పేర్కొన్నారు. వరికి క్వింటాల్‌కు రు. 117లు, మొక్కజొన్నకు రు.135లు అదేవిధంగా పత్తి, పెసర, కందులు, మినుములు, వేరుశెనగ వంటి పంటల కు మద్దతు ధరలు పెంచడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరికి రు. 500 బోనస్ ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రు. 2 లక్షల రుణమాఫీ చేయాలని, పండించే భూములకే రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన వంతెన నిర్మాణ పనులు

ఎండపల్లి, జూన్ 20: కొన్ని నెలలుగా మండలంలోని రాజారాంపల్లిలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. అసంపూర్తిగా వంతెన నిర్మాణం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో అనే కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించి పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. వానలు ప్రారంభం కాకముందే పనులు పూర్తి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

వరి గ్రేడ్ ఏ రకానికి బోనస్ రూ.. 500 చెల్లించాలి

కొడిమ్యాల, జూన్ 20 : వరి గ్రేడ్ ఏ రకం వరిధాన్యాన్ని సన్నరకాల ధాన్యంగా పెర్కొని 500 రూపాయల బోనస్ పెంచాలని పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరితో పాటు 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచడం రైతులకు ఊరట కలిగించిందన్నారు. నువ్వులు, వేరుశనగ, పత్తి మద్దతు ధర క్వింటాళకు 800 రూపాయలు పెంచాలని కోరారు. మద్దతు ధర పెంచిన ట్లయితే వంట నూనెల పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందన్నారు. వంట నూనెల పంటలకు, ఏ గ్రేడ్ వరి ధాన్యంకు బోనస్ పెంచి రాష్ట్ర రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.